జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 60 12-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో


తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


# తుది దశకు యుద్ధం..

- త్వరలోనే ఇరాన్‌తో యుద్ధం ముగిస్తాం
- ఇరాన్‌లోని అన్ని లక్ష్యాలను ఛేదించాం
- ఇరాన్ దగ్గర ఇంకేమీ మిగల్లేదు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఇరాన్‌తో యుద్ధం ముగిస్తామని అన్నారు. ఇప్పటికే ఇరాన్‌లోని అన్ని లక్ష్యాలను ఛేదించామని తెలిపారు. ఇప్పుడు కొత్తగా టార్గెట్ చేయడానికి ఇరాన్ దగ్గర ఇంకేమీ మిగల్లేదని అన్నారు. తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ఆగుతుందని చెప్పారు.





# పార్టీ మారలేదు

2లో

- దానం, కడియంకు అనర్హత వర్తించదన్న స్పీకర్ ట్రిబ్యునల్
- బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లు డిస్మిస్
- గతంలోనే 8 మందిపై అనర్హత పిటిషన్లు కొట్టివేత
- స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ అసంతృప్తి

# రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల ఊబిలోకి నెట్టారు


- బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయన్న జగన్
- తాము ఐదేళ్లలో చేసిన అప్పుల కంటే రెండేళ్లలో చంద్రబాబు ఎక్కువ చేశారని ఆరోపణ
- ట్రెజరీలో మినిమం బ్యాలెన్స్ కూడా ఉండటం లేదని విమర్శ

2లో



## పాలనలో మార్పు రావాలి..

# పరిశుభ్రతపై దృష్టి పెట్టండి



- స్వచ్ఛాంధ్రపై సీరియస్‌గా ఉండాలని, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచన
- సచివాలయ సిబ్బంది బదిలీలపై కలెక్టర్లకు పూర్తి అధికారాలు
- కౌలు రైతులకు రుణాల మంజూరులో అడ్డంకులు తొలగించాలని ఆదేశం
- పాలనలో డీప్ టెక్ వినియోగం పెంచాలని దిశానిర్దేశం

ఆరు జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న కాన్ఫరెన్స్ సమావేశం కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలు శాఖల ఉన్నతాధికారులు తమ నివేదికలను ప్రజెంటేషన్ల రూపంలో సమర్పించారు. ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర, పాలనలో సాంకేతికత వినియోగం, సచివాలయ సిబ్బంది సర్దుబాటు, కౌలు రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబు పలు కీలక ఆదేశాలు, సూచనలు జారీ చేశారు.

2లో





# వాణిజ్య నౌకలపై గురి!

- దుబాయ్ విమానాశ్రయం, చమురు కేంద్రాలపైనా
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలూ లక్ష్యమేనని ప్రకటన
- భారతీయునితో సహా నలుగురికి గాయాలు
- ఇరాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్, అమెరికా
- దాడులతో దద్దరిల్లిన టెహ్రాన్, ఇతర నగరాలు




దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం తగ్గుముఖం పట్టే సూచనలే కన్పించడం లేదు. 12వ రోజైన బుధవారం ఇజ్రాయెల్అమెరికా, ఇరాన్ భారీ స్థాయిలో పరస్పర దాడులను కొనసాగించాయి. పర్షియన్ గల్ఫ్ పొడవునా పలు వాణిజ్య నౌకలపై ఇరాన్ భారీ స్థాయిలో దాడులకు దిగింది. యూఏఈ నౌకాశ్రయంలో ఒక కంటైనర్ నౌకపై డ్రోన్ దాడి జరిపింది. నౌక పూర్తిగా ధ్వంసమైనట్టు పేర్కొంది. అంతేగాక దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనా ఇరాన్ మరోసారి డ్రోన్ దాడులు జరిపింది. రెండు డ్రోన్లు విమానాశ్రయంపైనే పడి పేలిపోయాయి. ఈ ఘటనలో ఒక భారతీయునితో సహా నలుగురు గాయపడ్డారు. అయితే విమానాల రాకపోకలు యథావిధిగా కొనసాగినట్టు విమానాశ్రయ వర్గాలు పేర్కొన్నాయి. అంతేగాక గల్ఫ్‌లోని అతి పెద్ద చమురు శుద్ధి కేంద్రాలపై కూడా ఇరాన్ ఎడాపెడా దాడులు జరిపింది.

మిగతా 2లో

# కేరళలో ఈసారి మా ప్రభుత్వమే

- ప్రధాని నరేంద్ర మోదీ ధీమా
- అభివృద్ధి కావాలంటే మార్పునకు పట్టం కట్టాలని పిలుపు
- కేరళ, తమిళనాడులో ప్రధానమంత్రి పర్యటన
- రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభం, శంకుస్థాపనలు



కొచ్చి/తిరుచిరాపల్లి: కేరళలో సీపీఎం నేతృత్వంలోని అధికార ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష యూడీఎఫ్ కూటములు అవినీతిలో కూరుకుపోయాయని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు కూటములకు గట్టిగా బుద్ధి చెప్పాలని కేరళ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మార్పునకు పట్టం కట్టాలని కోరారు. ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించారు. తొలుత కేరళలో 'అఖిల కేరళ ధీవర సభ' స్వర్ణోత్సవాలకు హాజరయ్యారు.



# ఫిరాయింపుల్లో ప్రథమ ముద్దాయి రాహుల్‌గాంధీ

- ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై బహిరంగ దాడి
- అసెంబ్లీ స్పీకర్‌ను రాహుల్ వెనుక ఉండి ఆడిస్తున్నాడు
- ఆయన అనుమతి లేకుండా స్పీకర్ సాహసం చేయలేరు
- ఫిరాయింపులపై దానం, కడియం వ్యాఖ్యలు హాస్యాస్పదం: కేటీఆర్

# జిల్లా కేంద్రాల చుట్టూ రింగురోడ్లు



- ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- పట్టణాల నుంచి రింగురోడ్లకు అనుసంధానంగారేడియల్ రోడ్లు.. విజయవాడ రహదారితోనాగార్జునసాగర్ అనుసంధానం
- ప్రభుత్వ వాహనాలుగా ఈవీలే ఉండాలన్న సీఎం

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖను ఆదేశించారు. జిల్లా కేంద్రాలైన ప్రధాన పట్టణాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడటంతో పాటు సరుకు రవాణా వాహనాలు వేగంగా ముందుకు సాగేందుకు రింగురోడ్లు దోహదం చేస్తాయని అన్నారు. బుధవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో

# రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల ఊబిలోకి నెట్టారు: జగన్

ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చిందని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడ్జెట్ గణాంకాల నుంచి అవినీతి వరకు పలు అంశాలపై గణంకాలతో సహా విమర్శలు గుప్పించారు. పరిపాలనాదక్షుడిగా బిల్డప్ ఇస్తున్న చంద్రబాబు, వాస్తవానికి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయని జగన్ ఆరోపించారు. కాగ్ నివేదికను ఉదహరిస్తూ.. ప్రభుత్వం చూపిస్తున్న లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని విమర్శించారు. "మేము ఐదేళ్లలో చేసిన అప్పుల కంటే చంద్రబాబు రెండేళ్లలోనే ఎక్కువ అప్పులు చేశారు" అని జగన్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో కోవిడ్ కష్టాల్లో కూడా ఎన్బీసీ (నెట్ బారోయింగ్ సీలింగ్ ) పరిమితిని దాటలేదని, కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే నెట్ బారోయింగ్ సీలింగ్ దాటి విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ. 3.31 లక్షల కోట్ల అప్పులు దాటేసిందని, జీఎస్డీపీలో అప్పుల శాతం 5.089కి పెరిగిందని గణాంకాలు వివరించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పడిపోవడానికి 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానమే కారణమని జగన్ విమర్శించారు. లిక్కర్ మాఫియా నుంచి భూములు కట్టబెట్టడం వరకు అన్నింటా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. విశాఖలో రూ. 5 వేల కోట్ల విలువైన భూములను చంద్రబాబు తన బంధువులకు కట్టబెట్టారని, రియల్ ఎస్టేట్ సంస్థలకు తక్కువ ధరకు భూములు ఇస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా ట్రెజరీలో మినిమం బ్యాలెన్స్ కూడా ఉండటం లేదని, ఏడాదిలో కేవలం 8 రోజులు మాత్రమే కనీస నిల్వలు ఉన్నాయని ఎద్దేవా చేశారు.

# జిల్లా కేంద్రాల చుట్టూ రింగురోడ్లు

(మొదటి పేజీ తరువాయి)

రోడ్లు భవనాల శాఖ, రవాణా శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రాల చుట్టూ ఉన్న రోడ్లను అనుసంధానించి రింగురోడ్లుగా మార్చాలని, ఆయా పట్టణాల నుంచి రింగురోడ్లకు అనుసంధానంగా రేడియల్ రోడ్లను నిర్మించాలని సీఎం ఆదేశించారు. సమీపంలోని జాతీయ రహదారులకు రింగురోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. హైదరాబాద్‌విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నుంచి నాగార్జునసాగర్ చేరేందుకు కొత్తగా రోడ్డు నిర్మించే అంశంపై కూడా అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలను వేగంగా పూర్తి చేసి, అవసరమైన కొత్త వాటి కోసం ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడంపై అధికారులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక నుంచి ప్రభుత్వ వినియోగం కోసం కొనే వాహనాలన్నీ ఎలక్ట్రిక్ వాహనాలే అయి ఉండాలని స్పష్టం చేశారు. 'క్యూర్' పరిధిలో అద్దెకు తీసుకునే ప్రభుత్వ వాహనాలు కూడా అవే ఉండాలని చెప్పారు. రవాణా శాఖలో ఇక అన్ని సేవలు ఆన్‌లైన్ ద్వారానే సాగాలని ఆదేశించారు. కార్యాలయాలన్నీ సొంత భవనాల్లోనే ఉండాలని, అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

### శంషాబాద్ సమీపంలో ఆధునిక బస్ టెర్మినల్

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు లఘు చిత్రాలు ప్రదర్శించాలని సీఎం సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో ఆధునిక బస్ టెర్మినల్ నిర్మించాలని, ఇందుకు స్థలం కేటాయిస్తామని, అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపుల్లో ప్రథమ ముద్దాయి రాహుల్‌గాంధీ




హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పు అత్యంత అప్రజాస్వామికం, దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆడిస్తున్న ఆటలో భాగంగానే స్పీకర్ ప్రసాద్‌కుమార్ పిటిషన్లు డిస్మిస్ చేశారన్నారు. అసెంబ్లీ స్పీకర్‌పై రాహుల్‌గాంధీ నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉందని చెప్పారు. తెలంగాణ నుంచి వస్తు న్న డబ్బు సంచుల కోసం ఇలాంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఫిరాయింపుల వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ నడిపించిందని, స్పీకర్ చేతుల్లో నిర్ణయాధికారం లేదన్నారు. పార్టీ ఫిరాయింపుల్లో ప్రథమ ముద్దాయి రాహుల్‌గాంధీ అని, ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగంపై కాంగ్రెస్ చేస్తున్న దాడిలో ప్రధాన నేరస్తుడు రాహుల్‌గాంధీ అని కేటీఆర్ విమర్శించారు. ఆయన అనుమతి లేకుండా అనర్హత పిటిషన్లు డిస్మిస్ చేసేంత సాహసం స్పీకర్ చేయలేరన్నారు. మాజీ మంత్రులు జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ తాతా మధు, పార్టీ నేతలు కర్నె ప్రభాకర్, డాక్టర్ ఆనంద్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులతో కలిసి కేటీఆర్ బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి. ఈ నిర్ణయంతో రాహుల్ గాంధీ జోకర్‌గా నిలిచిపోయారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే వెనువెంటనే సభ్యత్వం కోల్పోయేలా చట్టం తెస్తామని ప్రకటించిన రాహుల్‌గాంధీకి ఏమాత్రం సిగ్గు, గౌరవం ఉన్నా స్పీకర్ నిర్ణయంపై స్పందించాలి'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# వాణిజ్య నౌకలపై గురి!

(మొదటి పేజీ తరువాయి)

ఇకపై పశ్చిమాసియాలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కూడా లక్ష్యంగా చేసుకుని పెద్దపెట్టున దాడులు చేస్తామని ఇరాన్ జాయింట్ మిలిటరీ కమాండ్ ప్రకటించింది. దాంతో ఆ ఆర్థిక సంస్థల పరిస్థితిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ప్రయోగించిన 8 డ్రోన్లను నేలకూల్చినట్టు కువైట్, 5 డ్రోన్లను అడ్డుకున్నట్టు సౌదీ అరేబియా వెల్లడించాయి. ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపైకి ప్రయోగించిన 6 బాలిస్టిక్ క్షిపణులను కూడా నేలకూల్చినట్టు సౌదీ తెలిపింది. ఖతర్, ఒమన్, బహ్రెయిన్‌పై కూడా ఇరాన్ పెద్ద సంఖ్యలో డ్రోన్ దాడులు జరిపింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో రువైస్ చమురు శుద్ధి కేంద్రాన్ని మూసేస్తున్నట్టు యుఏఈ ప్రకటించింది. ఇజ్రాయెల్‌లో టెల్ అవీవ్, జెరూసలేంతో పాటు పలు నగరాలపైకి భారీగా క్షిపణులు ప్రయోగించింది.

మరోవైపు ఇజ్రాయెల్‌అమెరికా సంయుక్త దాడులు బుధవారం కూడా ఇరాన్‌ను అల్లాడించాయి. రాజధాని టెహ్రాన్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాలపై క్షిపణులు, బాంబుల వర్షం కురిసింది. టెహ్రాన్‌లోని బ్యాంక్ సఫా భవనం దాడుల్లో తీవ్రంగా దెబ్బ తింది. దాని సిబ్బందిలో పలువురు మృత్యువాత పడ్డట్టు ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ తెలిపింది. నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపైనా భారీగా క్షిపణి దాడులు జరిగాయి. హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థను లక్ష్యం చేసుకుని లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు బుధవారమూ కొనసాగాయి. రాజధాని బీరూట్‌లో అత్యంత జనసమ్మర్ధంతో కూడిన ఐచా బకర్ ప్రాంతంలో పలు భవనాలు దాడుల్లో పూర్తిగా దెబ్బతిని మంటల్లో చిక్కుకున్నాయి. దక్షిణ, తూర్పు లెబనాన్‌లో జరిపిన దాడుల్లో కనీసం 14 మంది మరణించినట్టు తెలుస్తోంది. వారిలో ఒక రెడ్‌క్రాస్ సిబ్బంది కూడా ఉన్నట్టు సమాచారం. లెబనాన్‌లో మృతుల సంఖ్య 570 దాటినట్టు ఆరోగ్య శాఖ వెల్లడించింది.

### 160 మంది అమెరికా సైనికులకు గాయాలు

ఇరాన్‌పై యుద్ధంలో ఇప్పటిదాకా 140 మంది అమెరికా సైనికులు గాయపడ్డట్టు పెంటగాన్ ప్రధాన అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ ధ్రువీకరించారు. "వారిలో ఎనిమిది మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. 108 మంది ఇప్పటికే ఆస్పత్రుల నుంచి డిశ్చార్జై విధుల్లో చేరారు"అని చెప్పారు. అయితే గాయపడ్డ అమెరికా సైనికుల సంఖ్య 160 పై చిలుకేనని తెలుస్తోంది. పారిస్: పశ్చిమాసియా యుద్ధంతో చమురు సరఫరా పడకేసిన నేపథ్యంలో అత్యవసర నిల్వల నుంచి 40 కోట్ల బ్యారెళ్ల చమురును విడుదల చేయాలని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఐఈఏ ఈ స్థాయిలో చమురు నిల్వలను విడుదల చేయడం చరిత్రలో ఇదే తొలిసారి! అయితే హోర్మూజ్ జలసంధి గుండా చమురు, సహజ వాయువు రవాణా వీలైనంత త్వరగా పునఃప్రారంభం కావడమే సమస్యకు పరిష్కార మార్గమని ఐఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫతీ బిరోల్ ఆశాభావం వెలిబుచ్చారు.

### మధ్యవర్తిత్వానికి తెర: ఖతర్

దోహా: ఇరాన్ దాడుల నేపథ్యంలో ఆ దేశం తరఫున చర్చల్లో మధ్యవర్తిగా కొనసాగబోనని ఖతర్ ప్రకటించింది. అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన అణు చర్చలకు ఆ దేశం మధ్యవర్తిత్వం వహించడం తెలిసిందే. అయినా తమపై ఇరాన్ దాడులు చేసిందంటూ ఖతర్ విదేశాంగ శాఖ ఉప మంత్రి మహమ్మద్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్‌ఖులైఫీ ఆవేదన వెలిబుచ్చారు. హోర్మూజ్ గుండా నౌకల ప్రయాణాన్ని అడ్డుకునేందుకు ఆ జలసంధిలో భారీ స్థాయిలో ఇరాన్ మందుపాతరలు అమర్చుతోంది! వీటిని తొలగించడం అత్యంత భారీ వ్యయప్రయాసలతో కూడిన పని. వాటి బారిన పడకుండా సురక్షితంగా హోర్మూజ్‌ను దాటే మార్గం ఇరాన్‌కు మాత్రమే తెలుసు! ఈ నేపథ్యంలో ఆ మందుపాతరలను తక్షణం తొలగించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు అల్టిమేటమిచ్చారు. లేదంటే ఆ దేశంపై దాడులను కనీవినీ ఎరగని స్థాయికి పెంచుతామని హెచ్చరించారు. హోర్మూజ్‌లో మందుపాతరలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్ పడవలను పేల్చేసినట్టు యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. మరోవైపు, హోర్మూజ్‌ను మూసేసినట్టు ఇరాన్ ప్రకటించినా, ఆ దేశానికి చెందినవిగా భావిస్తున్న పలు చమురు నౌకలు మాత్రం దానిగుండా ప్రయాణాలు కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది.

# కేరళలో ఈసారి మా ప్రభుత్వమే

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం కొచ్చిలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో భాగంగా రూ.11,000 కోట్ల విలువైన అభివృద్ధి, మౌలిక సదుపాయాలు ప్రాజెక్టులు ప్రారంభించారు, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించడం గమనార్హం. అనంతరం బీజేపీ ర్యాలీలో ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. రాష్ట్రంలో తమ పార్టీ బలం పెరిగిందని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. పశ్చిమాసియా పరిణామాలపై రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై మోదీ మండిపడ్డారు. పశ్చిమాసియా యుద్ధంపై ప్రజలను రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యంగా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మన దేశ అభివృద్ధి గురించి కాంగ్రెస్ యువరాజుకు ఏమాత్రం తెలియదని ఎద్దేవా చేశారు. మన కంపెనీలు, మన యువత సాధిస్తున్న విజయాలు రాహుల్ ఏం తెలుసని ప్రశ్నించారు. శబరిమల బంగారం దొంగతనంలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లకు ప్రమేయం ఉందని ఆరోపించారు. మత రాజకీయాలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధి అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఆ రెండు కూటములకు బుద్ధి చెప్పాలని, ఈసారి 'మోదీ గ్యారంటీల'తో ముందుకొస్తున్న బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. తమిళనాడు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఆయన తమిళనాడులోని తిరుచిరాపల్లిలో రూ.5,650 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు, మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అనంరతం ఎన్డీఏ ఎన్నిక ప్రచార సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో డీఎంకే పాలనలో మహిళలు, చిన్నారులపై నేరాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. నేరగాళ్లు యథేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే గెలిపిస్తే ప్రజలకు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతలు కాపాడుతామన్నారు. నేరగాళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తమిళనాడులో అవినీతికి అంతే లేకుండాపోయిందని దుయ్యబట్టారు. నదులన్నీ చివరికి సముద్రంలో కలిసిపోయినట్లు అవినీతి సొమ్ము చివరకు ఒక కుటుంబానికి చేరుతోందని సీఎం స్టాలిన్‌పై నిప్పులు చెరిగారు. డీఎంకే 'శాస్త్రీయమైన అవినీతి మోడల్'ను అమలు చేస్తోందన్నారు. తమిళనాడు అభివృద్ధి పట్ల తన వద్ద ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతాన్ని రేర్ ఎర్త్ కారిడార్‌లో ఒక భాగంగా మారుస్తామని ప్రకటించారు


# పార్టీ మారలేదు

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరారని పేర్కొంటూ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కొట్టేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభా పక్షం నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై ఇటీవల విచారణ పూర్తి చేసిన స్పీకర్ బుధవారం ఉదయం 10 గంటలకు తన తుది తీర్పును ప్రకటించారు. వాస్తవానికి తమ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు దాఖలు చేశారు. అయితే 8 మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను గతంలోనే డిస్మిస్ చేసిన స్పీకర్ తాజాగా.. దానం, కడియంకు సంబంధించి తీర్పు వెలువరించారు. వారు పార్టీ మారలేదని స్పష్టం చేశారు. కాగా స్పీకర్ నిర్ణయంతో దానం, కడియంపై కచ్చితంగా అనర్హత వేటు పడుతుందని భావించిన బీఆర్ఎస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. స్పీకర్ ట్రిబ్యునల్ నుంచి తీర్పు కాపీ అందిన తర్వాత తమ తదుపరి కార్యాచరణ ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 39 స్థానాలకే పరిమితమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 10 మంది కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. టి.ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), దానం నాగేందర్ (ఖైరతాబాద్), కాలే యాదయ్య (చేవెళ్ల), డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ (జగిత్యాల), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట్‌రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు) వీరిలో ఉన్నారు. అయితే దానం నాగేందర్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మరోవైపు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కావ్యకు బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వగా ఆమె చివరి నిమిషంలో కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా గెలుపొందారు.

# పాలనలో మార్పు రావాలి.. పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల తాను కాకినాడ, సామర్లకోటలో పర్యటించినప్పుడు రోడ్ల పక్కన చెత్త కనిపించిందని, కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్రపై సీరియస్‌నెస్ కొరవడిందని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్లు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల కోసం నగరాలు, పట్టణాలు ఒకదానికొకటి పోటీ పడాలని సూచించారు. పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని, ఆరోగ్యానికి ఇది చాలా కీలకమని గుర్తుచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బంది సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదని, ముఖ్యంగా మహిళా పోలీసుల సేవలు వృథా అవుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, అవసరాన్ని బట్టి సిబ్బందిని ఆర్ అండ్ బి, హెల్త్, మున్సిపల్ వంటి ఇతర శాఖలకు సర్దుబాటు చేసే పూర్తి అధికారాలను కలెక్టర్లకు అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. సిబ్బంది బదిలీలు సిఫార్సుల ఆధారంగా కాకుండా, రేషనలైజేషన్ ప్రకారమే పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో ఎలాంటి నిబంధనలు అడ్డంకిగా ఉన్నా వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.



వ్యవసాయంతో పాటు ఉద్యాన, పశుసంవర్ధక రంగాల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించేందుకు నానో యూరియాను ఉచితంగా అందించే అవకాశాన్ని పరిశీలించాలని, దీనిపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు. ఈ నెల 16, 17, 18, 23, 24, 25 తేదీల్లో 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. పాలనలో ఏఐ, బ్లాక్ చైన్, ఐఓటీ వంటి డీప్ టెక్నాలజీ వినియోగాన్ని పెంచడం ద్వారా వేగంగా, తక్కువ వ్యయంతో ఫలితాలు సాధించవచ్చని సీఎం తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తప్పనిసరి అర్హతగా చేర్చాలని సాధారణ పరిపాలన శాఖను ఆదేశించారు. ప్రతి జిల్లాలో హెచ్‌ఆర్ ఇనిస్టిట్యూట్, ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని పనితీరును మెరుగుపరుచుకోవాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# తుది దశకు యుద్ధం..

(మొదటి పేజీ తరువాయి)



కాగా, ఇరాన్ నౌకాదళం పనిచేస్తున్న పోర్టుల దగ్గరకు వెళ్లవద్దని అమెరికా సైన్యం పౌరులను హెచ్చరించింది. ఆ ప్రాంతాల్లో భద్రతకు హామీ ఇవ్వలేమని తెలిపింది. యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ ఇరానీ డాక్ కార్మికులు, పరిపాలనా సిబ్బంది, వాణిజ్య నౌకల సిబ్బంది ఇరాన్ నేవీ నౌకలు దగ్గరికి, సమీప సైనిక ప్రాంతాల వద్దకు వెళ్లవద్దని సూచించింది. అమెరికా దళాలు ఇరాన్ నౌకాదళ ఆస్తులపై దాడులు కొనసాగిస్తున్న సమయంలో యూఎస్ ఈ హెచ్చరిక చేసింది. ఇప్పటివరకు సుమారు 60 ఇరానీ నౌకలు ధ్వంసం చేశామని అమెరికా తెలిపింది. మరోవైపు, ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ భీకరదాడులు చేసింది. దాడుల్లో కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ గాయపడినట్లు ప్రచారం జరుగుతోంది. ఖమేనీ కాలికి ఫ్రాక్చర్, ఎడమ కంటి వద్ద గాయాలైనట్లు సమాచారం. అయితే, గత ఏడాది జరిగిన హత్యాప్రయత్నంలోనే ఖమేనీ గాయపడ్డారని ఇజ్రాయెల్ అంటోంది. ఇప్పటి వరకు ప్రజల ముందుకు మొజ్తబా ఖమేనీ రాలేదు.



## లక్ష్యమే శిఖరం.. పరీక్షే తొలిమెట్టు

- పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు
- పరీక్షా సామగ్రి పంపిణీ చేసిన సర్పంచ్
- మునిపంపుల ఉన్నత పాఠశాలలో వేడుక



**రామన్నపేట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేట మండలంలోని మునిపంపుల ఉన్నత పాఠశాలలో 202526 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 32 మంది పదవ తరగతి విద్యార్థులకు మునిపంపుల భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం పరీక్షలకు అవసరమైన పరీక్షా పలకలు, కొలమానాలు, రెండు కలములు చొప్పున అందజేశారు. మాజీ ఎంపీటీసీ గాదె పారిజాత కూడా విద్యార్థులకు కలములు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి మాట్లాడుతూ.. ఇప్పటివరకు కష్టపడి చదివిన విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా రాసి మంచి మార్కులు సాధించి తమ గురువులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తుకు తొలి మెట్టుగా భావించే పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఆహార సమన్వయ కమిటీ అధ్యక్షురాలు వెంకటమ్మ, భగత్ సింగ్ యువజన సంఘ సభ్యులు గంటెపాక శివ, భిక్షం, ఉదయ్, ఉపాధ్యాయులు తిరుమల రెడ్డి, వెంకటేశ్వర్లు, వసంత, మనోహర్, మంజుల, త్రివేణి ప్రసాద్, సరోజ, పాల్వంచ హరికిషన్, శ్రీశైలం, సునిత, రాకేశ్, అమరయ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పులిగిల్లలో వైభవంగా ఈదమ్మ తల్లి ఉత్సవాలు

- భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- డప్పు చప్పుళ్లు.. ఒగ్గు విన్యాసాలతో సందడి
- పులిగిల్లలో వెల్లువెత్తిన భక్తజనం
- వడ్డెరల కులదైవానికి ప్రత్యేక పూజలు



**వలిగొండ, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** వడ్డెరల కులదైవమైన ఈదమ్మ తల్లి పండుగను వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా జరిగే ఈ ఉత్సవాల్లో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామదేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక నైవేద్యాలు అర్పించారు. పెద్ద పెద్ద మేకపోతులతో గ్రామ దేవతల చుట్టూ ప్రదక్షిణలు చేయడం భక్తులను ఆకట్టుకుంది. భక్తులు సంప్రదాయ దుస్తులతో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు చేసిన విన్యాసాలు ఉత్సవాలకు మరింత శోభను తెచ్చాయి. డప్పు చప్పుళ్ల నడుమ ఒగ్గు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, శివశక్తుల పూనకాలతో గ్రామం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. గ్రామంలోని యువత, పెద్దలు కలిసి సంప్రదాయ పద్ధతుల్లో ఉత్సవాలను నిర్వహించారు. ఈదమ్మ తల్లి జాతరను తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, బోనాలు సమర్పించి తమ కుటుంబాల సుఖశాంతి కోసం ప్రార్థనలు చేశారు. గ్రామ ప్రజలందరూ ఐక్యంగా కలిసి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ఈదమ్మ తల్లి దీవెనలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని భక్తులు ప్రార్థించారు.

## తెలంగాణ మైనారిటీస్ రెసి డెన్షియల్ స్కూల్ లో ఇఫ్తార్ వేడుకలు

**ఆదిలాబాద్ (తొలివెలుగు న్యూస్):** పవిత్ర రంజాన్ మాసం క్రమ శిక్షణకు, త్యాగానికి, సోదర భావానికి ప్రతీక అని జిల్లా కలె క్టర్ రాజర్షిషా అన్నారు. బుధ వారం స్థానిక మైనారిటీస్ రెసి డెన్షియల్ స్కూల్ (చాందా బాయ్స్-1, బాయ్స్-2) లో ఏ ర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్ర మంలో ఆయన ముఖ్య అతి థిగా హాజరై విందు ను స్వీక రించారు. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ, పవిత్ర రం జాన్ మాసం క్రమశిక్షణకు, త్యాగానికి, సోదరభావానికి ప్రతీక అన్నారు. మైనారిటీ పా ఠశాలల్లో విద్యార్థుల కోసం ప్ర భుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని, ముఖ్యంగా రం జాన్ నెలలో ముస్లిం ఉద్యోగు లకు, విద్యార్థులకు ప్రత్యేక వె సులుబాట్లు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 29 మంది విద్యార్థులు ఖురా న్ పఠనం చేయడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

# వైద్య విద్యకు కొత్త శోభ..





- గుట్టలో మెడికల్ కాలేజీ పనులు ముమ్మరం
- స్థలాన్ని సందర్శించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదగిరిగుట్ట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్టలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు ఎప్పటి నుంచి ప్రారంభించనున్నారో, ప్రస్తుతం చేపడుతున్న ఏర్పాట్ల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వైద్య కళాశాల భవనానికి సంబంధించిన నమూనా మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు, వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వైద్య కళాశాల నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కళాశాల పూర్తయితే జిల్లాలో వైద్య విద్యకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం డీఈ, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## జనంపల్లి బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



- అధ్యక్షుడిగా నక్క నరేందర్
- కాంగ్రెస్ తీరుపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి ధ్వజం

**రామన్నపేట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేట మండల పరిధిలోని జనంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ సమావేశం నిర్వహించి నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశం తాజా మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆదేశాల మేరకు జరిగింది. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు సహా అనేక హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. అనంతరం బీఆర్ఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షునిగా నక్క నరేందర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బీరం రాజిరెడ్డి, గట్టు రాములు, ప్రధాన కార్యదర్శిగా సంఘీ ఐలయ్య, కార్యదర్శిగా ఎర్రబోయిన సత్తయ్య, కోశాధికారిగా గట్టు శేఖర్, ఉప కోశాధికారిగా మల్లెబోయిన కృష్ణను ఎన్నుకున్నారు. అలాగే అనుబంధ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, మాజీ ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండ ఉపేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ చొప్పరి నరసింహ, వార్డు సభ్యులు నక్క రాణి రాములు, నల్ల సైదులు, రైతు విభాగం అధ్యక్షుడు చొప్పరి లింగయ్య, యువజన విభాగం అధ్యక్షుడు శివాజీ, సోషల్ మీడియా అధ్యక్షుడు నవీన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నేతన్న 'బాలరాజు' కుటుంబాన్ని ఆదుకోండి

- చేనేత కార్మిక సంఘం డిమాండ్
- ప్రకటనలకే పరిమితమైన 'నేతన్న భరోసా'
- చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు

**రామన్నపేట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు మిర్యాల బాలరాజు అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేనేత వృత్తిలో పూట గడవక అప్పుల పాలవుతున్న కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూలు, రంగుల ధరలు పెరగడం, నేసిన బట్టలకు సరైన మార్కెట్ లేకపోవడం వల్ల చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నూలు, రంగులపైనే కాకుండా నేసిన బట్టలపై కూడా జీఎస్టీ పేరుతో పన్నులు విధించడం వల్ల చేనేత పరిశ్రమ తీవ్రంగా దెబ్బతిందని, కేంద్ర ప్రభుత్వం ఈ రంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు కూడా ప్రకటనలకే పరిమితమయ్యాయని, చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా వంటి పథకాలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని అన్నారు. చేనేత కార్మికులు మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కూడా సంవత్సరాల తరబడి అందడం లేదని ఆయన ఆరోపించారు. మిర్యాల బాలరాజు కుటుంబానికి తక్షణ సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో చేనేత కార్మికుల ఆత్మహత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ముషం సత్యనారాయణ, ముషం శ్రీనివాసు, ఎలగందుల అంబాదాసు, కూరపాటి బిక్షపతి, ముషం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.






## లింగోజిగూడెంలో అక్రమ మద్యం పట్టివేత

- షాపులో తనిఖీలు చేసిన పోలీసులు
- 18 బాటిళ్ల స్వాధీనం.. నిందితుడిపై కేసు

**చౌటుప్పల్, మార్చి 11 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ మండల పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వలందాస్ స్వామి (65) తన షాపులో మద్యం విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో బుధవారం సాయంత్రం ఎస్ఐ కే. ఉపేందర్ రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 18 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి సర్పంచ్ భరోసా

- రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత
- దర్శనమ్మ మృతికి కాంగ్రెస్ నాయకుల సంతాపం

**రామన్నపేట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్) :** రామన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధికి చెందిన కోట దర్శనమ్మ (వెంకటేష్ సతీమణి) మృతికి సర్పంచ్ గరిక సత్యనారాయణ బుధవారం నివాళులర్పించారు. ఆమె భౌతికకాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జమీరొద్దీన్, ఉప సర్పంచ్ మోటే రమేష్, వార్డు సభ్యుడు మోటే మహేష్ తదితరులు దర్శనమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట సుధాకర్, శేఖర్, నాసర్, గోదాసు ప్రవీణ్, లవణం సాయి, ప్రసాద్, పల్లపు రవి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# బడ్జెట్ సమావేశాల్లో ఉద్యమకారుల బిల్లు ప్రవేశపెట్టాలి

- టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్



**నవలిగొండ, మార్చి 11 (తొలివెలుగు న్యూస్)** : అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టాలని మలిదశ ఉద్యమకారుడు, టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు. బుధవారం వలిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాణాలకు తెగించి పోరాడి సాధించుకున్న తెలంగాణలో 13 ఏళ్లు గడిచినా ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు లభించకపోవడం శోచనీయమన్నారు. సీమాంధ్ర పాలకుల అణచివేతను ఎదిరించి నిలిచిన పోరాట యోధులను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. తక్షణమే మంత్రివర్గ ఉపసమితితో పాటు చట్టబద్ధమైన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఉద్యమకారుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విద్యుత్ కోతలను అరికట్టాలి

- రైతులకు నిరంతర సరఫరా అందించాలి
- సుంకిశాలలో సిపిఎం నిరసన



**వలిగొండ, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** మండలంలో కొనసాగుతున్న విద్యుత్ కోతలను తక్షణమే అరికట్టి ప్రజలకు, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం వలిగొండ మండలం సుంకిశాల గ్రామంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో విద్యుత్ కోతలు అధికంగా పెరిగాయని తెలిపారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కోతలు మరింత పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొనడంతో పాటు మోటార్లు కాలిపోతున్నాయని, దీనివల్ల రైతులకు ఆర్థిక నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. మరోవైపు గ్రామాల్లో నివసించే ప్రజలు కూడా తరచూ జరిగే విద్యుత్ కోతల కారణంగా తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారని తెలిపారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని విద్యుత్ కోతలను నియంత్రించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, చెరుకు జంగయ్య, మంగ పాండు, పోలేపల్లి ఉప్పలయ్య, ఈతాప నగేష్, కాటేపల్లి వెంకటేశం, పోలేపల్లి పెద్ద స్వామి, బోదాసు సోములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా భాగ్యలక్ష్మికి పురస్కారం

- ఘనంగా సన్మానించిన భువనగిరి మున్సిపల్ చైర్మన్



**రాజపేట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్వాడీ టీచర్ రాపాక భాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలేరు ప్రాజెక్టు స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన అంగన్వాడీ టీచర్ రాపాక భాగ్యలక్ష్మి, ఆయా యాదమ్మలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భువనగిరి మున్సిపల్ చైర్మెన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మెన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, సీడీపీఓ రేకల స్వరాజ్యం శాలువా కప్పి భాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. మహిళా సాధికారతకు అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చైర్‌పర్సన్ పావనికి ఫోటోగ్రాఫర్ల సన్మానం

**చౌటుప్పల్, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన మోగుదాల పావని రమేష్ గౌడ్‌ను చౌటుప్పల్ మండల ఫోటో & వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రజలకు మరింత సేవ చేసి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సంఘం సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉడుగు రమేష్ గౌడ్, గంగాపురం కాటంరాజు గౌడ్, చౌటుప్పల్ మండల అధ్యక్షుడు తోర్పునూరి సాయిలు గౌడ్, ప్రధాన కార్యదర్శి సుక్క స్వామి, సహాయ కార్యదర్శి రోషణ గారి రాఘవేంద్ర గౌడ్, చింతల గణేష్, భారత మధు, బొడిగె ప్రభాకర్ గౌడ్, కత్తుల రవి, కందగట్ల కృష్ణ, మెట్టు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా మ్యాపింగ్ పక్కాగా ఉండాలి





- యాదగిరిగుట్టలో కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ
- పొరపాట్లకు తావు లేకుండా జాబితా రూపకల్పన
- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశం
- ఇందిరా కాలనీలో ఓటర్ల జాబితా తనిఖీ

**యాదగిరిగుట్ట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఎస్ఐఆర్ (స్పెషల్ సమ్మరీ రివిజన్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్టలోని ఇందిరా కాలనీలో ఉన్న పోలింగ్ కేంద్రం నెం.145 వద్ద ఓటర్ల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రత్యేక ఎస్ఐఆర్ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ గణేష్ నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల శిక్షణ.. అంతా తూతూ మంత్రమే!

- అవగాహన లేని 'వార్డు' సభ్యులు!
- తరగతులకు రాని ప్రజాప్రతినిధులు
- వలిగొండలో వెలవెలబోయిన శిక్షణ హాలు
- 110 మందికి గాను హాజరైంది 30 మందే





**వలిగొండ, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు అధికారాలు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు వలిగొండ మండలంలో తూతూ మంత్రంగా మారినట్లు కనిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమానికి వార్డు సభ్యుల స్పందన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. మండలంలోని 13 గ్రామపంచాయతీల నుంచి మొత్తం 110 మంది వార్డు సభ్యులు శిక్షణకు హాజరు కావాల్సి ఉండగా బుధవారం జరిగిన తరగతులకు కేవలం 20 నుంచి 30 మంది మాత్రమే హాజరైనట్లు తెలిసింది. దీంతో శిక్షణ హాలు వెలవెలబోయిన దృశ్యం కనిపించింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం వార్డు సభ్యుల అధికారాలు, గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై ఈ తరగతుల్లో అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అయితే చాలా మంది ప్రజాప్రతినిధులు తరగతులకు గైర్హాజరవడం పట్ల స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే వార్డు సభ్యులకు ఈ శిక్షణ ఎంతో అవసరం అయినప్పటికీ చాలా మంది నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఐదేళ్ల పదవీకాలంలో గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అవగాహన ఈ తరగతుల ద్వారా లభిస్తుందని, అందువల్ల వార్డు సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని స్థానికులు సూచిస్తున్నారు.

# రోగులకు మెరుగైన సేవలందించాలి





- మోటకొండూర్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- రిజిస్టర్ల పరిశీలన.. గర్భిణీలకు సూచనలు

**మోటకొండూర్, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది క్రమంగా విధులకు హాజరవుతున్నారా అనే అంశంపై అటెండెన్స్ రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సంఖ్య, ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజూ వచ్చే ఓపీ రోగుల సంఖ్య, వారికి అవసరమైన పరీక్షలు ఆసుపత్రి ప్రయోగశాలలోనే చేస్తున్నారా లేక బయటకు పంపిస్తున్నారా అనే అంశాలపై కూడా ఆరా తీశారు. ప్రయోగశాలలో సాధారణంగా నిర్వహిస్తున్న పరీక్షల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులు సరిపడా ఉన్నాయా లేదా అని పరిశీలించి, మందుల నిల్వల రిజిస్టర్‌ను కూడా తనిఖీ చేశారు. రోగులకు ఏ ఏ మందులు ఇస్తున్నారో నమోదు చేస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెకప్ కోసం వచ్చిన గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ.. వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అలా చేస్తే పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







## లక్ష్యసాధనకు క్రమశిక్షణే మార్గం

- మల్లాపురం జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు
- విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**యాదగిరిగుట్ట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్) :** జీవితంలో ఎదగాలంటే విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని, ఇవే మనిషిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయని యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గవ్వల రాములు అన్నారు. బుధవారం జెడ్పీహెచ్ఎస్ మల్లాపురం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఆత్మీయంగా ఏర్పాటు చేసి పదో తరగతి విద్యార్థులకు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు గవ్వల రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో చదువుకుని కృషి, పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థానాలు సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో గడిపిన అనుభవాలను గుర్తుచేసుకుని ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వం తమ జీవితానికి బలమైన పునాది అని తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ నాలుగో వార్డు సభ్యుడు కల్లెం రాజు పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేయాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ డిమాండ్



**రాజపేట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్) :** రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం రాజపేటలో సిపిఎం మండల కార్యదర్శి ఇటికల రామచంద్రం అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయని విమర్శించారు. దీంతో రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అంతరాయం లేని విద్యుత్ అందించిందని, అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి ప్రయత్నాలు చేయడంలో విఫలమవుతోందని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు ప్రతి సారి విద్యుత్ వచ్చినప్పుడు పొలాలకు వెళ్లి మోటార్లు ఆన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఇక గృహ వినియోగానికి సంబంధించిన విద్యుత్ సరఫరాలో కూడా తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, వేసవికాలం నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎండలు పెరిగిన సమయంలో విద్యుత్ కోతల కారణంగా వడదెబ్బలు, అనారోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై సమగ్రంగా చర్చించి రైతులకు, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పబ్బోజు రాధమ్మ, కత్తుల నర్సిరెడ్డి, మీసాల నరసింహ, రఘుపతి జానీ, బచ్చలి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత వైద్య శిబిరం

- కాల్వపల్లిలో గర్భకోశ వ్యాధులపై తనిఖీలు
- సింగారంలో గాలికుంటు నివారణ టీకాలు
- గ్రామ సర్పంచ్ ఇంజ లక్ష్మీ

**రాజపేట, మార్చి 11 (తొలివెలుగు. న్యూస్):** రాజపేట మండలం కాల్వపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఇంజ లక్ష్మీ ప్రారంభించారు. డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పశువులకు వివిధ రకాల గర్భకోశ సంబంధిత వ్యాధులపై పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. శిబిరంలో ఎదకురాని పశువులు, గర్భకోశ వాపు, చీము వంటి సమస్యలతో బాధపడుతున్న పశువులను పరీక్షించి అవసరమైన చికిత్సలు అందించారు. అలాగే పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కూడా ఇచ్చారు. పాడి రైతులకు పశువుల సంరక్షణ, పశు గ్రాస నిర్వహణపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాల్వపల్లి గ్రామ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంజ నరేష్, ఇంజ దాసు, రైతులు వెంకటయ్య, ఇంజ నవీన్, ఇంజ సాయి, ఇంజ నాని, ఇంజ రవి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని సింగారం గ్రామంలో జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం. చంద్రారెడ్డి మాట్లాడుతూ.. పాడి రైతులు తమ పాడి పశువులు, దూడలకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధి కారణంగా పాలు తగ్గడం, జ్వరం రావడం, మేత తినకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కల్నే రవి, కే. సిద్దులు, తిప్పర్తి శ్రీకాంత్, అజయ్ కుమార్ తదితరులు, పాడి రైతులు పాల్గొన్నారు.



# మూసీ అభివృద్ధి పేరుతో ఇళ్ల కూల్చివేత

- మహిళా సంక్షేమ పథకాలపై నిర్లక్ష్యం
- ఖమ్మంలో 900 ఇళ్ల కూల్చివేతపై విమర్శలు
- అభివృద్ధి కాదుడ భూముల అమ్మకమే లక్ష్యం
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలపై స్పందన లేదు
- బీఆర్ఎస్ కాలంలో మహిళలకు ప్రాధాన్యం
- మహిళలు చదువుకుని ఎదగాలి
- సమాజంలో మహిళలకు సమాన హక్కులు
- ప్రజల సమస్యలపై ప్రభుత్వం మౌనం
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



**పటాన్‌చెరు, (తొలివెలుగు న్యూస్):** పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కే.సి.ఆర్ నగర్ ఫేజ్2లో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందు మరియు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ఆయనతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు నాయకులు కే.సి.ఆర్ నగర్ ప్రాంతంలో సోమిరెడ్డి ఏర్పాటు చేసిన నూతన టెంట్ హౌస్ మరియు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబులెన్సులను ప్రస్తుతం తొలగించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, షీ టీమ్స్, మహిళల కోసం గురుకుల పాఠశాలలు, కళ్యాణ లక్ష్మి పథకం, కేసీఆర్ కిట్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని కొనసాగించడం లేదని విమర్శించారు. మహిళలు చదువుకుని స్వయం సమృద్ధిగా ఎదగాలని, సమాజంలో వారికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూసీ నది అభివృద్ధి పేరుతో ఇళ్లను కూల్చివేస్తోందని, ఖమ్మంలో సుమారు 900 ఇళ్లను కూల్చివేశారని అన్నారు. అభివృద్ధి పేరుతో ఇళ్లను కూల్చి ఒకే ఇంటిని నిర్మించడం జరుగుతోందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వానికి అభివృద్ధి కన్నా భూములను అమ్మడంపైనే ఎక్కువ ఆసక్తి ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట ఆంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జిన్నారం వెంకటేష్ గౌడ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, తెల్లాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ బూచి రెడ్డి, వైస్ ఛైర్మన్ మధు, మాజీ కౌన్సిలర్లు కంజర్ల శ్రీశైలం, బాబ్జీ, ఉమేష్, నాగరాజు, సాగర్, శ్రీపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కుమార్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, మాద్రి పృథ్వీరాజ్, రాజ్ కుమార్, పరమేష్ యాదవ్, చిన్న, మాణిక్ యాదవ్, పాటి సత్యనారాయణ, దేవేంద్ర చారి, జగన్నాథ్ రెడ్డి, కేఎస్ఆర్ నగర్ ఇన్‌చార్జ్‌లు రషీద్, కోటేష్, ఆంజనేయులు, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

- బీసీ కాలనీ పాఠశాలలో ఘనంగా స్వీయ పాలన దినోత్సవం

**చౌటుప్పల్, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వీయ పాలన దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, వివిధ శాఖల అధికారుల పాత్రల్లో ఒదిగిపోయి పాఠశాలను నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు ఎస్.కె. సాజిద్ ఎమ్మెల్యేగా, ఎం.డి. జైనుల్ కలెక్టర్‌గా, పి. హర్ష డీఈఓగా తమ బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే ఎంఆర్ఓగా ఎం.డి. వసంత్, ఎంపీడీఓగా బి. ఉదయ్, ఎంఈఓగా వి. అఖిల్, కాంప్లెక్స్ హెచ్ఎంగా కె. తరుణ్ తేజ, హెచ్ఎంగా వి. దివ్య, ఏఏపీసీ చైర్మన్‌గా బి. కార్తీక్ వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ ఇ. గురువారావు, కాంప్లెక్స్ హెచ్ఎం కె. శివకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. పద్మమ్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కె. హర్ష, మధన్ రెడ్డి, ఎల్. ప్రభావతి, పి. అన్నపూర్ణ పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్
- రాజపేటలో మండల స్థాయి శిక్షణ తరగతులు

**రాజపేట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్) :** బీజేపీ కార్యకర్తలు క్రమశిక్షణతో మెలుగుతూ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సేవలు అందించాలని పార్టీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ సూచించారు. బుధవారం రాజపేటలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ మండల స్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షులు మేకల రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు, విధానాలను కార్యకర్తలు సక్రమంగా అర్థం చేసుకుని ప్రజలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బీజేపీ చరిత్ర వికాసం, సిద్ధాంత భూమిక, పార్టీ కార్యపద్ధతి, కార్య విస్తరణ, సామాజిక మాధ్యమాల వినియోగం, అంత్యోదయ సిద్ధాంతం, బూత్ నిర్వహణ తదితర అంశాలపై నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా చిరిగె శ్రీనివాస్, బందారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ యాదవ్, గుజ్జ సోమనర్సయ్య, గుర్రం వెంకటేశం, దాసరి మల్లేశం తదితరులు వివిధ అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురి చంద్ర, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి, మండల జనరల్ సెక్రటరీ మెండు భగవాన్ రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ బూరుగు శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని
- శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

**చౌటుప్పల్, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** మహిళలు అన్ని రంగాల్లో ముందుండి తమ ప్రతిభను చాటుకోవాలని చౌటుప్పల్ పురపాలిక చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కల్పన కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ పొందిన మహిళలకు బుధవారం లయన్స్ క్లబ్ భవనంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని మాట్లాడుతూ.. మహిళల్లో అపారమైన శక్తిసామర్థ్యాలు దాగి ఉంటాయని తెలిపారు. మహిళలు సంకల్పంతో ముందుకు సాగితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రామానంద తీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసిన మహిళలు అందుకున్న సర్టిఫికెట్ల ఆధారంగా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం పొందుతూ స్వయం ఉపాధి ఏర్పాటుచేసుకోవచ్చన్నారు. తమ సంస్థ ద్వారా నైపుణ్యాభివృద్ధి కోసం మరింత ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పోలోజు శ్రీనివాస్ చారి, ట్రస్ట్ సెక్రటరీ మొగుదాల రమేష్, సేవా సెక్రటరీ అతహర్ పాషా, ట్రెజరర్ సిలివేరు మంగయ్య, సభ్యులు ఉప్పు ఆంజనేయులు, నాంపల్లి రమేష్, కొసనం రామ్ రెడ్డి, బత్తిని రఘు తదితరులు పాల్గొన్నారు.







## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

- చౌటుప్పల్‌లో 'ఉమెన్స్ ఫర్ ట్రీ' కార్యక్రమం
- పాల్గొన్న వైస్ చైర్మన్ వినయ్ కుమార్, కౌన్సిలర్లు



**చౌటుప్పల్, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించి మన చౌటుప్పల్‌నుటు కాపాడుకుందామని మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అమృత్ మిత్ర పథకం కింద "ఉమెన్స్ ఫర్ ట్రీ" కార్యక్రమాన్ని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఖాళీ స్థలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ చెట్లు పెంచే బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ హన్ను మహమ్మద్, 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, నాయకులు ఉడుగు రమేష్, చింతల సాయిలు, కొమ్ము లక్ష్మయ్య, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, దీప, హనుమాన్ ప్రసాద్ (సానిటరీ ఇన్‌స్పెక్టర్), మెప్మా టీఎంసీ కవిత, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, జవాన్లు నరసింహ, అంజయ్య తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీగా గంజాయి మొక్కలు స్వాధీనం

- నలుగురు నిందితుల అరెస్ట్
- ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో కే సు నమోదు
- ప్రధాన నిందితుడు మిగిలిన వారిని గంజాయి ని సేవించే లా చేసి, వారి చేతనే విక్రయి స్తూ, వ్యాపారం
- 420 గంజాయి మొక్కలు స్వాధీనం
- స్వాధీనం చేసుకున్న మొక్కల విలువ దాదాపు 42 లక్షలు
- యువత గంజాయికి దూరం గా ఉండాలి
- మాదకద్రవ్యాలు లేని జిల్లా కృ షికి జిల్లా పోలీసులకు సహక రించాలి
- గంజాయి పండించిన వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు
- పత్రిక సమావేశంలో వివరా లను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ (తొలివెలుగు న్యూస్):** ఎ1) పవర్ మాధవ్, తండ్రి: ఆనంద్రావు, వయసు: 55 సంవత్సరాలు, నివాసం: సో న్‌పల్లి గ్రామం, సిరికొండ మం డలం, ఆదిలాబాద్ జిల్లా. ఎ2) ఆత్రం దత్తాత్రి, తండ్రి: ఆత్రం మాధవ్, వయసు: 23 సంవత్సరాలు, నివాసం: ఇచ్చోడ గ్రామం, ఆదిలాబాద్ జిల్లా. ఎ3) షేక్ ముజాయిద్, తండ్రి: షేక్ జావీద్, వయసు: 24 సంవత్సరాలు, నివాసం: ఇంద్రానగర్, ఆదిలాబాద్ (ప్ర స్తుతం ఇచోడ గ్రామం).ఎ4) షేక్ ఆరిఫ్, తండ్రి: షేక్ ఫకీర్ మహమ్మద్, వయసు: 42 సం వత్సరాలు, నివాసం: ఇచోడ గ్రామం, ఆదిలాబాద్ జిల్లా. నేను నిందితులపై కేసు నమో దు చేసినట్లు పోలీసులు వెల్ల డించారు. జిల్లా వ్యాప్తంగా గం జాయి నిర్మూలనే లక్ష్యంగా, గంజాయి రహిత జిల్లాగా ని ర్మించేందుకు చేస్తున్న జిల్లా పో లీసుల కృషికి ప్రజలు ప్రతి ఒక్కరు సహాయ సహకారా లందించాలని జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్ తెలిపారు. యువత ప్రజలు గంజాయి బారిన పడకూడదని, గంజా యికి దూరంగా ఉండాలని మాదకద్రవ్యాల వల్ల జీవితా లు నాశనం అవుతాయని గుర్తు చేశారు. సోమవారం ఇ చ్చోడ మండలం హీరాపూర్ గ్రామంలో ప్రధాన నిందితుడు ఏ వన్ పవర్ మాధవ్ సోం పల్లి సిరికొండ గ్రామానికి చెం దిన వ్యక్తి ఇచ్చోడ మండలం హీరాపూర్ గ్రామం లో తొమ్మి ది ఎకరాల వ్యవసాయ భూ మిలో శనగ పంట మధ్యలో గంజాయి పండిస్తున్నాడని, విశ్వసనీయ సమాచారం మే రకు సోమవారం ఎస్ఐ రమే ష్ ఆధ్వర్యంలోని బృందం దా డి చేయగా నలుగురి వద్ద గం జాయి లభ్యమైనట్టు తెలిపా రు. ప్రధాన నిందితుడు ఏ వన్ వద్ద 390 గంజాయి మొక్క లు, మిగిలిన వారి వద్ద తలా పది గంజాయి మొక్కలు ల భ్యమైనట్టు తెలిపారు. ఈ నలుగురికి గంజాయి సేవించి అలవాటు ఉన్నందున వారు గంజాయిని పండిస్తూ అదే విధంగా గంజాయి ద్వారా అ ధిక లాభాలు పొందాలనే దు రుద్దేశంతో ప్రధాన నిందితుడు ఏ వన్ పవర్ మాధవ్ మిగిలి న వారికి గంజాయి తాగడాని కి ఇస్తూ, జాతీయ రహదారి వద్ద ప్రయాణిస్తున్న లారీలకు అమ్ముతూ ఉండమని చెప్పే వాడు అలా అమ్మిన డబ్బుల నుండి 500 రూపాయలను మిగిలిన నిందితులకు ఇవ్వ డం, వారి జల్సాలకు గంజా యిని ఇస్తూ, ప్రధాన నిందితు డు గంజాయి వ్యాపారం కొన సాగుతూ ఉండగా జిల్లా పో లీసులు దానిని అడ్డుకొని నిం దితులను అరెస్టు చేసి రి మాండ్ కు తరలించడం జ రుగుతుందని తెలిపారు.వీరం దరూ పథకం ప్రకారం గంజా యిని పండిస్తూ, అమ్ముతూ, సేవిస్తూ జల్సాలకు పాల్పడే వారని తెలిపారు.

# శిథిలావస్థలో 'చదువుల' కోవెల

- రామన్నపేట మండల గ్రంథాలయం దుస్థితి
- నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన చదువుల కోవెల
- వాన పడితే పుస్తకాలపై నీటి చుక్కలు
- పెచ్చులూడే స్లాబ్‌ల కింద చదువుకుంటున్న నిరుద్యోగులు
- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందుల్లో పాఠకులు
- మహిళా పాఠకులకు మరుగుదొడ్ల సౌకర్యం లేక కష్టాలు
- దశాబ్దాల చరిత్ర ఉన్నా నిర్వహణలో నిర్లక్ష్యం
- ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఇబ్బందులు
- పుస్తకాల సంరక్షణపై అధికారులు ఉదాసీనత
- గ్రంథాలయ పునర్నిర్మాణానికి ప్రజల డిమాండ్
- ఎమ్మెల్యే చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయాలన్న విజ్ఞప్తి





**రామన్నపేట, మార్చి 11 (తొలివెలుగు న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో జ్ఞానాన్ని విస్తరించే కేంద్రాలుగా నిలవాల్సిన గ్రంథాలయాలు నేడు పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనాలుగా మారుతున్నాయి. వందలాది మంది నిరుద్యోగుల ఆశల నిలయంగా, విద్యార్థుల విజ్ఞాన నిలయంగా నిలిచిన రామన్నపేట మండల కేంద్ర గ్రంథాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని కూలిపోతుందనే భయాన్ని కలిగిస్తోంది. ఒకప్పుడు పాఠకులతో కళకళలాడిన ఈ చదువుల కోవెల ఇప్పుడు నిర్లక్ష్యానికి బలి అయి వెలవెలబోతోంది.

**చరిత్ర ఉన్నా భవిష్యత్తు సందిగ్ధం:**

రామన్నపేట గ్రంథాలయానికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1965 నుంచి 1985 వరకు అద్దె భవనంలో కొనసాగిన ఈ గ్రంథాలయానికి అప్పటి గ్రామ పంచాయతీ సర్పంచ్ బట్టే వెంకటయ్య చొరవతో సొంత స్థలం దక్కింది. అనంతరం 1985లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో సొంత భవనానికి శంకుస్థాపన చేసి 1986లో ప్రారంభించారు. ప్రారంభ దశలో పాఠకులతో సందడిగా ఉన్న ఈ గ్రంథాలయం గత పదిహేనేళ్లుగా సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది.

**వాన పడితే పుస్తకాలే ప్రాయశ్చిత్తం:**

గ్రంథాలయం పైకప్పు పూర్తిగా దెబ్బతినడంతో స్వల్ప వర్షం కురిసినా నీరు లోపలికి చొరబడుతోంది. దీంతో బీరువాల్లో నిల్వ ఉంచిన విలువైన పుస్తకాలు తడిసి పాడవుతున్నాయి. పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడే ప్రమాదం ఉండటంతో లోపల కూర్చుని చదువుకోవడానికి విద్యార్థులు, నిరుద్యోగులు భయపడుతున్నారు. "లోపల కూర్చుంటే ఎప్పుడు ఏ పెచ్చు నెత్తిన పడుతుందో తెలియదు. వాన పడితే పుస్తకాలను కాపాడుకోవడమే సరిపోతోంది. ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తున్నా చదువుకోవడానికి ప్రశాంతమైన వాతావరణం లేక ఇబ్బందులు పడుతున్నాం" అని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎమ్మెల్యే స్పందిస్తారా?**

స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే నిధులు మంజూరు చేసి కొత్త భవన నిర్మాణం చేపట్టాలని నిరుద్యోగ యువత, స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి రామన్నపేట గ్రంథాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

**సౌకర్యాల లేమి.. నిరుద్యోగుల ఆవేదన..**

రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తుండటంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత సంఖ్య పెరుగుతోంది. అయితే గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు లేకపోవడం వారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. కూర్చోవడానికి సరిపడా కుర్చీలు, బల్లలు లేకపోవడం, తాగునీటి సదుపాయం లేకపోవడం, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు పాఠకులను ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా మహిళా పాఠకులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ముఖ్య సమస్యలు ఒకచూపులో**

- శిథిలమైన భవనం: పైకప్పు నుంచి నీరు కారడం, పెచ్చులూడటం
- మౌలిక వసతుల కొరత: తాగునీరు, మరుగుదొడ్లు, సరిపడా ఫర్నిచర్ లేకపోవడం
- పుస్తకాల నష్టం: వర్షపు నీరు కారణంగా విలువైన విజ్ఞాన సంపద పాడవడం



**పాలకుల నిర్లక్ష్యం:**

గత ప్రభుత్వ కాలంలో గ్రంథాలయ భవన పునర్నిర్మాణం కోసం పలుమార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయిందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా సమస్య పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదని యువత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



## దేశాభివృద్ధికి జనగణనే దిక్సూచి

**ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాటే**



**ఆదిలాబాద్ (తొలివెలుగు న్యూస్):** దేశాభివృద్ధి, భవిష్యత్ ప్రణా ళికల రూపకల్పనకు పకడ్బం దీగా జరిగే జనగణనే దిక్సూ చిగా ఉంటుందని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) యువరాజ్ మర్మాటే అ న్నారు. బుధవారం ఆదిలా బాద్ కలెక్టరేట్ సమావేశ మం దిరంలో నిర్వహించిన "భారత జనగణన2027" కు సంబం ధించిన జిల్లా, డివిజన్, మం డల స్థాయి అధికారుల మూ డు రోజుల శిక్షణా కార్యక్రమా న్ని ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎస్. రాజేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పి ఓ మాట్లాడు తూ, జనగణన నుండి జన కల్యాణం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమా న్ని చేపట్టిందన్నారు. క్షేత్ర స్థా యిలో సేకరించే సమాచారం భవిష్యత్తు సంక్షేమ పథకాల కు ఆధారమవుతుందని, అం దువల్ల ఎక్కడా పొరపాట్లు లే కుండా గణన చేపట్టాలని సూ చించారు. ముఖ్యంగా మారు మూల గిరిజన తండాల్లో ఏ ఒక్క ఇళ్లు కూడా మిగలకుం డా గణన నిర్వహించాలన్నా రు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ రా ష్ట్రం ఏర్పడిన తర్వాత జరు గుతున్న మొట్టమొదటి జనగ ణన ఇదని తెలిపారు. దేశం లో ఇది 16వ జనగణనగా నిర్వహించబడుతుందని చె ప్పారు. ఈ ప్రక్రియ రెండు దశ ల్లో జరుగుతుందని వెల్లడిం చారు. మొదటి దశలో భాగం గా హౌస్ లిస్టింగ్ ప్రక్రియ మే 11, 2026 నుంచి జూన్ 9, 2026 వరకు జరుగుతుందని తెలిపారు. ఇందులో ఇంటి ని ర్మాణం, వసతులు, కుటుంబ యజమాని వివరాలు తదిత రంగా 33 అంశాలపై సమా చారం సేకరిస్తారని చెప్పారు. రెండో దశగా జనాభా గణన ఫిబ్రవరి 2027లో నిర్వహించి, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని వివరిం చారు.దేశంలో తొలిసారిగా ఈసారి జనగణనను పూర్తి స్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు అధికా రులు తెలిపారు. మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్ ద్వారా గణన చేపట్టడంతో పాటు, ప్రజలు తమ వివరాలను తా మే స్వయంగా ఆన్‌లైన్‌లో న మోదు చేసుకునే సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నా రు. గణన ప్రారంభానికి 15 రోజుల ముందే ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి రానుంది.ఈ శిక్షణా కార్యక్రమంలో హైద రా బాద్ జనాభా గణన విభాగం గణాంక అధికారులు ఆదెపు వినయ్, వై. జంగయ్యలు అధి కారులకు శిక్షణ ఇచ్చారు.